విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఆరు సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను 100 శాతం గుర్తించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ సర్వశిక్ష అభియాన్, ఐసిడిఎస్, వైద్యాధికారులకు సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సర్వ శిక్ష అభియా న్ , ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులతో, డిఎంఅండ్‌హెచ్‌వో, ఎస్ఆర్.హెచ్.ఎం అధికారులతో కలెక్టర్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందించవలసిన సేవల గురించి మంగళవారం చర్చించారు. వీరిని గుర్తించడానికి అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు సహకారం తీసుకోవాలని సూచించారు. 6 - 18 సంవత్సరాల పిల్లలకు సంబంధించిన డేటా అందుబాటులో ఉందని, అయితే ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని కూడా గుర్తించాలన్నారు. ఈ గుర్తింపు ప్రక్రియ జూన్ 12లోగా జరగాలన్నారు. ప్రత్యేక అవసరతలు గల పిల్లల గుర్తింపు, వారికి అందించవలసిన సేవలకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సర్వ శిక్ష అభియాన్ పీడీకి సూచించారు. ప్రతి ఒక్కరికి సదరం సర్టిఫికెట్లు, ఆధార్ లేకపోతే ఆధార్ కార్డులు ఇప్పించాలన్నారు. పాఠశాలలకువెళ్లలేని వారిని గుర్తించి అలాంటి వారికి ఇంటి వద్ద మంచి పోషకాహారం, విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వైద్యశాలల్లో పని చేస్తున్న చిన్నపిల్లల వైద్యులు వారికి అవసరమైన పోషకాహారం సూచించి ప్రభుత్వపరంగా మంచి ఆహారం అందే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించాలన్నారు. అవసరమైతే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐఎంఏ డాక్టర్ల సహకారం తీసుకో వాలన్నారు. ప్రభుత్వం అందించే ఉపకర ణాలతో పాటు దాతల సహ కారం తీసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సర్వశిక్షా అభియాన్, ఎస్ఆర్‌హెచ్ఎం నిధులు సక్రమంగా వినియో గించాలన్నారు. ఈ సమావేశంలో సర్వ శిక్షాఅభియాన్ పీడీ, ఉషారాణి, ఐసిడియస్ పీడీ, సౌజన్య డిఇవో, గంగా భవాని, డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకట ప్రసాద్, విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడి. అలీ, రాష్ట్ర డాక్టర్ సురేష్ బాబు, రెడ్ క్రాస్ సెక్రెటరీ మస్తానయ్య, ఎస్ఆర్‌హెచ్ ఎం డాక్టర్ లు పాల్గొన్నారు.

త్వరితగతిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లాలో మంజూరైన సాగునీటి పారుదల ప్రాజె క్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ యం హరి నారాయణన్ అధికారులను ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ తో కలసి జిల్లాలో మంజూరైన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికా రులతో సమావేశమై సమీక్షించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమశిల హై లెవెల్ లిఫ్ట్ కెనాల్ ఫేజ్ -1, ఫేజ్-2 ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా చేయాలని అధికా రులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వ, డికేటి, చుక్కల భూముల భూ సేకరణ ప్రక్రియ పై నిర్దిష్టమైన గడువును నిర్ధారించుకొని ఆ గడువులోపు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ, సంబంధిత ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన భూసేకరణప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్.ఈ హరి నారాయణ రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వర రావు, తెలుగు గంగప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం

- టిడ్కో ఇళ్లకు పూర్తి వసతులు కల్పన
- విద్యుత్ మెరుగుకు కృషి
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - కావలి : మున్సిపాలిటీలో ప్రజలు పడుతున్న బాధలు, ఇబ్బందులు పూర్తిగా తొలగిస్తామని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో నూతన మునిసిపల్ కమిషనర్ కిరణ్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని 4 డివిజన్లలో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎప్పటి కప్పుడు పరిస్తితి సమీక్షించి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చెత్తను తరలించే నెట్టుడు బండ్లు, ట్రాక్టర్లను వెంటనే రిపేర్ చేయించి వార్డు ఇంచార్జిల సహకారంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పిడుగులు పడటం వలన సెంట్రల్ లైటింగ్ సరిగా పనిచేయడం లేదని, అక్కడక్కడా వీధి లైట్లు వెలగడం లేదని, వాటిని కూడా త్వరలో రిపేర్ చేయిస్తామని తెలిపారు. వాటికి కావలసిన మెటీరియల్ తెప్పిస్తామని, త్వరలోనే వెలుగులు నింపుతామని అన్నారు. మునిసిపాలిటీ లోని ప్రధాన సమస్య అయిన మంచి నీటి కష్టాలను కూడా తీరుస్తామన్నారు. అమృత్ పథకం ద్వారా ఇప్పటికే మునిసిపాలిటీ పరిధిలో 90శాతం పనులను పూర్తి చేశామన్నారు. సమ్మర్ ట్యాంక్ నుండి వచ్చే పైప్ లైన్ దెబ్బ తినడం వలన నీటి సమస్యలు వస్తున్నాయని, వెంటనే పైప్ లైన్ ఇబ్బందికరంగా ఉండే ప్రాంతంలో నూతన పైప్ లు బిగించే చర్యలు తీసుకుంటామని అన్నారు. టిడ్కో ఇల్లు 2112 ఉండగా దానిలో 500 వరకు ఇల్లు ఖాళీగా ఉన్నాయని వాటిని కూడా అవసరమైన లబ్దిదారులకు అందజేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇళ్ళలో చేరి ఉన్న వారికి కరెంట్, నీరు, లైట్స్, ఫాన్స్ ఇవ్వాల్సిందిగా మునిసిపల్ అధికా రులకు తెలిపామన్నారు. వెంటనే బ్లాక్ వారీగా ఈ పనులు ప్రారంభి స్తామన్నారు. డ్రైనేజీ లు, పంట కాలువలు సిమెంట్ కాంక్రీట్ తో శాశ్వతంగా నిర్మిస్తామని, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని అన్నారు. జగనన్న ఇళ్ళను కూడా లబ్దిదారులకు అందజేసే విధంగా త్వరితగతిన పనులు జరుగు తు న్నా యని, త్వరలోనే వాటిని లబ్ది దారులకు అందజేస్తామని అ న్నా రు. మునిసిపాల్టీ లో కరెంట్ సమ స్య ఉందని, లో-వోల్టేజ్ సమస్య నూతన ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేస్తామని, అధికారులతో కుడా మాట్లాడం జరిగిందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించడానికి కృషి చేస్తామన్నారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని బుడంగుంట గిరిజన కాలనీలో నివసిస్తున్న కడు నిరుపేదలకు "మీకోసం" స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్ కుమార్ రాయపాటి ఆధ్వర్యంలో మంగళవారం చికెన్ బిర్యానీ పంపిణీ చేశారు. అమె రికా నివాసి కట్టానోయల్ రాజ్ కుమారుడు అలెన్ పాల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందరంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ నోయల్ స్ఫూర్తి ప్రదమైన సేవా గుణం కలిగిన వ్యక్తని తెలిపారు. ఆయన కుమారుడు అలెన్ పుట్టిన రోజు వేడుకలు పేదల మధ్య జరపడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షులు కుందుర్తి శ్రీనివా సులు మాట్లాడుతూ మీకోసం సేవాసంస్థ అనేక కుటుంబాలలో వెలుగులు నింపే ధ్యేయంతో ముందుకెళుతుందని తెలిపారు. కట్టా ఫ్యామిలి అంటే సేవకు మారుపేరైన త్యాగరాజు, బాలరాజు వారసులైన నోయల్ కుమారుడు అలెన్ పాల్ పుట్టినరోజు వేడుకలు ఆడంబరాలకు పోకుండా పేదల కడుపు నింపడం స్ఫూర్తి దాయక విషయమని, ఇటువంటి కార్యక్రమాలను మీకోసం సంస్థ ద్వారా చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మీకోసం సేవాసంస్థ గౌరవ సలహాదారులు మాల కొండారెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులు పి.నవీన్ కుమార్, జనంల్ సెక్రటరీ ఆవులమంద శ్రీనివాసులు,సెక్రటరీ డానియేల్ బాబ్జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒంగోల్ సంతోష్ కుమార్, నికిత్, అలెన్ సోదరులు రాజేష్, ఆరెన్, రహమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి కేడెట్లకు సీమాన్ షిప్ శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 10 ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్ సి సి నెల్లూరు కమాండర్,లెఫ్టినెంట్ కమాండర్ అండ్ క్యాంప్ కామాండెంట్ వినయ్ రామ చంద్రన్ సారథ్యంలో కొడవలూరు మండ లం లోని నార్త్ రాజుపాలెం లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణా శిబిరంలో కేడెట్లకు క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి ,సామాజిక సేవ, ఆయుధ శిక్షణ, గన్ ఫైరింగ్, కవాతు, జాతీయ సమైక్యత, పర్యా వరణ పరిరక్షణ,వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం పరిశుభ్రత, శీమాన్ షిప్ లో భాగంగా తాడులు ఎలా తయారు చేస్తారు. ముడులు ఎలా వేయాలి, వేయడంలో శిక్షణ అందులో రకాలు, ముడులు వాటి ఉప యోగాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. నెల్లూరు మండల పరిధిలోని కొత్తూరు అటవీ ప్రాంతంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్ నందు కేడెట్లకు ఫైరింగ్ శిక్షణ థర్డ్ ఎన్ సి సి ఆఫీసర్ విద్యాసాగర్,సూరజ్ బగేల్ నేతృత్వంలో హవల్దార్ బ్రిజ్ పాల్ సింగ్ ,అనీల్ శర్మ శిక్షణ నిచ్చారుఈ కార్యక్రమం సెకండ్ ఆఫీసర్లు ఎస్ కే ఖాదర్ బాష, గుండాల నరేంద్ర బాబు,సి.వి. నాగరాజు థర్డ్ ఆఫీసర్ కె.మస్తానయ్య, కేర్ టేకేర్ ప్రళయ కావేరి సుష్మిత, ఎన్ సి సి స్టాఫ్ శివ ప్రసాద్, వెంకటేష్ రాథోడ్, నీలేష్, అరుణ్ శర్మ రామన్, ఎన్ సి సి కేడెట్లు పాల్గొన్నారు.

విష్ణుకు సీనియర్ ఎమ్మెల్యేలు పరామర్శ

విశాలాంధ్ర - కావలి : వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ని హైదరాబాద్ లోని తన నివాసంలో పరామర్శించారు. ఇటీవల విష్ణు కాలుకు శస్త్ర చికిత్స చేయించుకొని హైదరాబాద్ లో విష్ణు విశ్రాంతి తీసుకుంటున్నారు. రెండు నెలలుగా తీవ్రమైన కాలు నొప్పితో విష్ణు బాధపడుతున్నాడు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే లు కోరారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - కావలి : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ పిజి సెంటర్ కావలి నందు సిఆర్‌ఎం డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామ ని, పది, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ను 91820 31895 నంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

కుంభాభిషేకానికి రావాలని మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర-ముత్తుకూరు: ఈనెల పది నుండి 12వ తేదీ వరకు కృష్ణపట్నం గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కుంభాభిషేకానికి రాష్ట్ర వ్యవసాయ , మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మాత్యులు కాకాని గోవర్ధన్ రెడ్డిని ఆహ్వానించినట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కోవూరు జనార్దన్ రెడ్డి మంగళవారం తెలిపారు. మంత్రి నివాసంలో పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ రాగాల వెంకటేశ్వర్లు, పాలక మండల సభ్యులతో కలిసి ఆయన నెల్లూరులోని మంత్రి నివాసంలో మంత్రిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఆయన తెలిపారు. 13.5 కోట్ల రూపాయలతో వేణుగోపాలస్వామి ఆలయాన్ని పునః నిర్మించడం జరిగిందని తెలిపారు. స్వామివారి విగ్రహ ప్రశ్న కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆయన కోరారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మార్కెట్లో డిమాండ్ ఉన్న వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అధికారులకు సూచించారు. మంగళ వారం మధ్యాహ్నం కలెక్టర్ చాంబర్లో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వృత్తి నైపుణ్య కోర్సులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపయోగపడే వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఏసీ, ఫ్రిడ్జ్ మెకానిక్, ప్లంబింగ్, డ్రైవింగ్, జేసీబీ, క్రేన్ ఆపరేటింగ్, పెయింటింగ్ మొదలైన కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న 10 డెవలప్మెంట్ హబ్ లలో ఈ కోర్సులను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.తొలుత జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి వినీల్ కుమార్ జిల్లాలోని స్కిల్ డెవలప్మెంట్ హబ్ లలో చేపడుతున్న శిక్షణ, యువతకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు మొదలైన విషయాలను క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి వినీల్ కుమార్, డిఆర్డిఏ పీడీ సాంబశివారెడ్డి, గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, జేఈవో భవానిశంకర్ పా ల్గొన్నారు.

పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్

విశాలాంధ్ర -కందుకూరు రూరల్: సరైన పత్రాలు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్.కె యండి. రఫీ తెలిపారు. మంగళవారం కందుకూరు లో వాహనాల ఆకస్మిక తనిఖీలలో భాగంగా ట్రాక్టర్ ట్రైలర్, మీడియం గూడ్స్ వాహనాలను తనిఖీ చేయగా వాటిలోని డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్, టాక్స్ కట్టని వాహనాలను గుర్తించారు. వాటికీ జరిమానా రూ.44640 వరకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్ ట్రైలర్ కు సంవత్సర కాలం నుండి ట్యాక్స్, ఫిట్నెస్ లేని కారణంగా దాన్ని కందుకూరు ఆర్టీసీ డిపోలో సీజ్ చేశారు. ప్రతి వాహన దారులు తమ వాహనాలకు విధిగా టాక్స్ కట్టాలని , లేకుంటే డ్రైవింగ్ లైసెన్స్ ప్రతి ఒక్క వాహన చోదకుడు కలిగి వుండాలని, సరి అయిన ధ్రువపత్రా లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహన చోదకుడు ప్రమాద రహితంగా వాహనాలు నడుపాలని సూచించారు.

పనితీరు మెరుగుపరచుకోవాలి

- రూ.ఏడు కోట్ల ఉపాధి పనులపై ఆడిట్
- 5వేల లోపే రికవరీ
- డ్వామా పీడీ పీ వెంకట్రావు

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ఉపాధి హామీ పనులు కూలీలకు వరం లాంటి పథకమని పనిచేసే సిబ్బంది బాధ్యతా యుతంగా పనిచేసి ప్రతి పైసా కూలీలకు అందే విధంగా పనిచేయాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నెల్లూరు జిల్లా డ్వామా పీడీ పీ వెంకట్రావు తెలిపారు. ఏఎస్ పేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గత ఏడాది చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఏ పీ డి శంకర్ నారాయణ పర్యవేక్షణలో ఏపీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో ఏపీవో మాట్లాడుతూ 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన 660 పనులను ఏడు కోట్ల 43 లక్షల 471 రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. వాటిపై గత వారం రోజులుగా ఎస్ ఆర్ పి మురిద్ ఆధ్వర్యంలో డిఆర్పిలు సోషల్ ఆడిట్ నిర్వహించారని తెలిపారు. ఎంపీపీ పద్మజా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కూలీల వలసల నివారణకు ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయలు ఉపాధి నిధులను దుర్వినియోగం కాకుండా సక్రమంగా వారికి చేరేలా పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో జరిగిన పనులపై ఆడిట్ నిర్వహించిన డిఆర్పిలు వారి నివేదికలను చదివి వినిపించారు. కూలీలకు ఐదు కోట్ల 91 లక్ష 87 వేల రూపాయలు చెల్లించగా మెటీరియల్ కాంపోనెంట్ కింద 989000లు, పంచాయతీరాజ్ విభాగంలో 36 పనులకు ఒక కోటి 41లక్ష,78 వేల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. మొత్తం పనుల్లో జరిగిన కోట్ల రూపాయల నగదు పంపిణీలో మండలంలో కేవలం 5000 రూపాయల లోపే రికవరీ కి అధికారులు ఆదేశించారు. మండలంలో గతం కంటే ప్రస్తుతం నూరు శాతం పనులు సక్రమంగా జరిగాయి అనటానికి ఇది నిదర్శనం గా చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో డివిఓ సురేష్ బాబు, ఎంపీడీవో భాస్కర్ ,ఈసీ నవీన్,ఎంపీటీసీలు సర్పంచులు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

కాకర్ల ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర- ఉదయగిరి: మండల పరిధిలోని ఎర్రబెల్లి గడ్డ లో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. సంజీవిని ఆరోగ్య తరం ద్వారా గ్రామానికి చెందిన వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 132 మందిని డాక్టర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఈసీజీ రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మరో 102 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శకునాలపల్లి మాజీ సర్పంచులు కేశవ నారాయణ, పోతుల ప్రభాకర్ రెడ్డి , ఆర్లపడే సర్పంచ్ పెండ్యాల మాధవరావు, మాజీ సర్పంచ్ వాడుకప్ప మాలాద్రి యాదవ్ , మోహన్ రెడ్డి, కొండప నాయుడు, రావులపల్లి నరసయ్య, పోలగిరి మహేష్, చింతల వెంకటేశ్వర్లు, వెంకట నరసయ్య, మహేష్, కొండేటి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు స్థానిక గ్రంథా లయం లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటండి - ప్రకృతిని కాపాడండి - ఆరోగ్యాన్ని పెంపొం దించు కోండి..' అనే అంశంపై అవగాహన కల్పించామని గ్రంథాలయ ఇన్ఛార్జి అధికారి ధనమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకు డు కె.వెంకటేశ్వ ర్లు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణాలు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న కాలనీలలోని గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరు నియో జ కవర్గంలోని కందుకూరు మున్సిపాలిటీ కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం గుడ్లూరు, ఉలవపాడు మండలాల ఎంపీడీవోలు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మెప్మా సంబంధిత శాఖల అధికారులతో మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం లో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలలో జరుగుతున్న అలసత్వం పై ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనుంచైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలు వేగంగా జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మానికి హౌసింగ్ నెల్లూరు జిల్లా పీడీ నరసింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ.అలీ, డిఎల్‌డిఓ పద్మజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, హౌసింగ్ ఇంచార్జ్ డిఇ శ్రీనివాసరావు, అన్ని మండలాల ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, మెప్మా, ఏపీఎంలు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దాడులు హేయమైన చర్య: సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిపై దాడులు చేయడం హేయమైన చర్య అని సీపీఐ నాయకులు అన్నారు. సంతపేట ఆనం వెంకటరమణారెడ్డి పై జరిగిన దాడిని సీపీఐ నాయకులు ఖండించారు. సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్,షానవాజ్, మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై సమాధానం చెప్పే విధంగా ఉండాలే గాని ప్రశ్నించారని దాడి చేయించడం విష సంస్కృతి అని, ఇలాంటి విష సంస్కృతిని ఏ రాజకీయ పార్టీ కూడా సమర్థించదన్నారు. ఆనం వెంకటరమణారెడ్డిపై జరిగిన దాడి అప్రజాస్వామ్యం అని, ప్రశాంతతకు మారు పేరైన నెల్లూరు జిల్లాలో ఇలాంటి దాడులు జరగడం బాధాకరం అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా ఎస్పీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని దాడికి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజీజ్, అహ్మద్, వెంకటేశ్వర్లు, సుల్తాన్ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగులకు తీపికబురు: ఎపిజిఎఫ్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా, సంతపేట, ప్రైవేట్ భవనంలో ఎపిజిఎఫ్ సమావేశం నిర్వహించారు. దీర్ఘ కాలి కంగా రెగ్యులరైజేషన్ కోసం ఎదు రుచూస్తున్న ఉద్యోగులకు తీపి కబురు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వర్గ కమిటీ ద్వారా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ తో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో అనేక కుటుంబాల్లో ఎంతో సంతోషాన్ని కలిగించిందని, దీర్ఘకాలికంగా కాంట్రాక్టు విధానంలో సేవలందిస్తూ మృతి చెందిన వారి కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పించి సంబంధిత కుటుంబాల వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం అహర్నిశలు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి, జనరల్ సెక్రెటరీ అరవ పాల్ కి ఎపిజిఇఫ్ ఉమ్మడి నెల్లూరు జిల్లా చైర్మన్ చేజెర్ల సుధాకర్ రావు జనరల్ సెక్రెటరీ దేవిరెడ్డి రమణారెడ్డి హంస జనరల్ సెక్రెటరీ కమల్ కిరణ్, ఏపీ టిఎస్ఏ జిల్లా నాయకులు రెహమాన్, ఖాదర్ వలీ, విరాజేష్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ ఆదర్శవంతంగా చేపట్టాలి: కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని సామాజిక, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను అత్యంత ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రజలకు సౌకర్య వంతంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ తన పర్యట నలో తెలిపారు. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని సంతపేట, ములుముడి బస్టాండ్, ఆర్.ఆర్ స్ట్రీట్, కుసుమ హరిజన వాడ, గాంధీనగర్, ఆత్మకూరు బస్టాండ్, కొత్తహాల్ వెనక ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రజా మరుగుదొడ్లను మంగళ వారం కమిషనర్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రూపొందించిన టాయిలెట్ 2.0 కార్యక్రమంలో భాగంగా నూతన మరుగుదొడ్ల నిర్మాణం, మరుగుదొడ్లలో మౌలిక వసతుల కల్పన, ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లలో దివ్యాంగులకు అవసరమైన వసతులు, చిన్న పిల్లల కోసం సౌకర్యాలతో పాటు, మహిళలకు అవసరమైన శానిటరీ నాప్కిన్ లను కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొత్త హాల్ సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని, మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్ ఈ.ఈచంద్రయ్య, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలబడలేం..కూర్చోలేం..!

- బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

విశాలాంధ్ర - ఉలవపాడు: పేరుకే మండల కేంద్రం కనీసం ప్రయాణికులు నిలబడటానికి కానీ కూర్చోవడానికి కానీ మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేదు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణించేందుకు నిత్యం ఎంతో మంది ప్రయాణికులు ఉలవపాడు చేరుకుని అక్కడ నుండి రకరకాల ప్రాంతాలకు ప్రయాణం కొనసాగిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ ఉలవపాడు ప్రజల దురదృష్టమేమో కానీ కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి కూడా సరిగా నిలబడటానికి కూడా వసతి కరువైంది ఎన్నో దశాబ్దాల గా మండల కేంద్రమైన ఉలవపాడు లో ఒక్క బస్సు షెల్టర్ నిర్మించలేకపోవటం అధికారులకు మండల కేంద్రం పై ఉన్న నిర్లక్ష్యం కనపడుతోంది బస్సు ఆగే ప్రాంతాలైన అంబేద్కర్ బొమ్మ నుంచి సింగరాయకొండ బస్టాండ్ ప్రాంతం వరకు ఎక్కడ చూసినా రోడ్లు ఆక్రమించుకొని ఎప్పుడు వాహనాలతో రద్దీగా ఉంటుంది. ప్రయాణికులు బస్సు వచ్చేలోపు కొంచెం సేపు కూడా కూర్చోవడం నిలబడటం కుదరక ఆటోలను ఆశ్రయించి సింగరాయకొండ ఇటు కావలి ప్రాంతాలకు చేరు కుని అక్కడి నుండి ప్రయాణం కొనసా గిస్తు న్నారు. కనీస అవసరం గా భావించే బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే ప్రయా ణికులు కొంత సౌకర్యం గా ఉంటుందని ఉలవ పాడు ప్రయా ణికులు చర్చించు కుంటున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికా రులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని బస్ షెల్టర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

దుకాణాల వద్ద తడి, పొడి చెత్త బిన్స్ తప్పనిసరి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వ హిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరిం చాలని, ప్రతీ దుకాణం వద్ద డస్ట్ బిన్ లను నిర్వాహకులు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా ములుముడి బస్టాండ్ కూడలి, చిన్న బజార్, పెద్ద బజార్, రాయాజి వీధి, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ మంగళవారం ఉదయం 6.30 గంటలకు పర్యవేక్షించారు. అనంతరం స్థానిక చిన్న బజారులో పండ్ల షాపుల నిర్వాహకులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ పండ్ల ప్యాకింగ్ పేపర్లను డ్రైను కాలువల్లో వేయరాదని, ప్రతీ దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్ లను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. డస్ట్ బిన్ లను ప్రజలకు కనిపించేలా షాపుల ప్రాంగణాల్లో ఉంచి, అవసరమైన వారు తప్పనిసరిగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచిం చారు. షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే షాపు నిర్వాహకునికి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందిం చాలని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గృహ వ్యర్థాలను అందించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చి తిరిగి వినియోగంలోకి తీసుకురాగలమని కమిషనర్ ప్రజలకు వివరించారు. వాహనాలకు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వలన దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. సండే మార్కెట్ సమీపంలోని యాచకులతో మాట్లాడిన కమిషనర్, వారు స్వంత గృహాలు, పెన్షన్ సదు పాయాలు కలిగివున్నారా? అని విచారించారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమాన్ని అందించేందుకు కృషి చేయాలని అధికారు లను కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, టీ.పి.ఆర్.ఓ ప్రసాద్, సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచి వాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారుడు పాలస్

విశాలాంధ్ర రూరల్-కందుకూరు: ప్రజా ఉద్యమకారుడు సుదర్శి పాలస్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ.మాలకొండయ్య అన్నారు. పాలస్ ఏడో వర్థంతి సభ సీపీఐ కార్యా లయం లో జరిగింది. ఈ సందర్భంగా పి మాలకొండయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి వామపక్ష భావజాలం పునికి పుచ్చు కొని తన జీవితం యావత్తు ప్రజా ఉద్యమాలకి అంకితం చేసిన ఉద్యమ కారుడు అన్నారు. అనేక పోరాటాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం పని చేసిన కమ్యూనిస్టు అని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి ఎస్ రామమ్మ మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం శ్రమించి ప్రజా నాయకుడిగా తన ప్రస్థానం కొనసాగించిన వ్యక్తి పాలస్ అని అన్నారు. ఎంతోమంది విద్యార్థులను వామపక్ష భావజాలం వైపు నడిపించిన పాల స్ అంతిమ లక్ష్యం సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయటమే ఆయనకు మనం అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు, సహాయ కార్యదర్శి పి బాలకోటయ్య, ఏ ఐ టి యుసి కార్యదర్శి వై ఆనందమోహన్, సిపిఐ నాయకులు డి ఆదినారాయణ, ఎం లక్ష్మీనారాయణ ,ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి మాల్యాద్రి ఏఐటీయూసీ నాయకులు బి బాలబ్రహ్మచారి, కోటేశ్వరరావు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు యు మాధవరావు పాల్గొన్నారు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నేత సిఆర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: కమ్యూని స్టుల ఉద్యమం బలప డా లనే లక్ష్యంతో పని చేసిన వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు ప్ర పం చ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన భారతీ యుడు చంద్ర రాజేశ్వరరావు ఆయన ఆశయాలను కొన సాగించడమే మన కర్తవ్యం అని చంద్ర రాజేశ్వరరావు 19వ జయంతి సందర్భంగా నెల్లూరు సీపీఐ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా విశాలాంధ్ర బ్యూరో దయాశంకర్ మాట్లాడుతూ భారతదేశంలో వామపక్ష ఉద్యమానికి సిఆర్ ఒక పెద్ద దిక్కు అని ఆయన సంపన్న కుటుంబంలో పుట్టిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి అని, ఆయన కమ్యూనిస్టు ఆశయా లను చెప్పటమే కాక తాను ఆచరించే చూపించేవారని నిస్వార్థ నిరాడంబరంగా తన జీవితాన్ని గడిపిన వ్యక్తి అని అన్నారు. 1980 లో కమ్యూనిస్టుల చీలిక తర్వాత దేశంలో తిరిగి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఒక వేదిక మీదకు తీసుకు రావాలని సిఆర్ అవిరళంగా కృషి చేసిన వ్యక్తి అని, నేటి రాజకీయ పరిస్థితులలో సి ఆర్ చేసిన కమ్యూనిస్టుల ఐక్యత ఉద్యమాన్ని ముందు కు తీసుకువెళ్లి ఆయన ఆశయాన్ని కొనసాగించడం మేకాక భారత దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి రక్షించుకునే కృషి చేయాలని అందుకు ప్రతి ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ముందుకు వచ్చి నడుము బిగించాలన్నారు. సీపీఐ నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్వాస్ ఇన్సాఫ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, అబ్దుల్, వెంకటేశ్వ ర్లు పాల్గొని సిఆర్‌కు ఘనంగా నివాళి అర్పించారు.

మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీ: వైద్యాధికారి

విశాలాంధ్ర- రాపూరు: జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణా కార్య క్ర మంలో మలేరియా నివారణ మాసోత్సవాలు జూన్ 1నుండి 30తేది వరకు జరిగే కార్యక్ర మం లో మంగళవారం రాపూ రు మండలం వేపినాపి ఆరోగ్య కేంద్రంలో రాపూరు మండలంలో ఉన్న వైద్య ఆరోగ్య సిబ్బంది మొత్తం ఇవాళ ఆషాడే మీటింగుకు అటెండ్ అవ్వడం మలేరియా మాసోత్సవం ర్యాలీ నిర్వహించారు. మండలంలో వైద్య ఆరోగ్య శాఖ సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎండల అధికంగా ఉండడం వల్ల కావాల్సిన మందులన్నీ సరఫరా చేస్తారని ఎక్కడా ప్రజలకు ఆరోగ్య ప రంగా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్ర మం గురించి విశ్లేషణలు చేయడం ఎక్కడన్నా లోటుపాట్లు ఉంటే దాన్ని ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి? అని చెప్పి వివరించారని వేపినాపి వైద్య అధికారులు డాక్టర్ వివి సూర్య ధర్మేంద్ర, డాక్టర్ జి సుదర్శనమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ, పి హెచ్ ఎన్, ఎం పిహెచ్ఓ, ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్, పీహెచ్‌సీ స్టాఫ్ మొత్తం పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం.. స్పందనకు అర్జీదారులు ఆధార్, ఫోన్ నెంబర్ లతో అర్జీలు ఇవ్వాలి: తహశీల్దారు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన జగనన్న కు చెబుదాం స్పందన తహశీల్దారు సుభాషిణి ఆధ్వర్యంలో మండలాభివృద్ధి అధికారి వీర్రాజు, మండల అన్ని శాఖల అధికారులతో ఉదయం 11 గంటకు నిర్వహించామని తహశీల్దారు సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ మొదటిరోజు సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయని రాపూరు కొత్త పేటలో నీటి సరఫరాలో డ్రైనేజ్ నీరు కలుస్తోందని శాంపిల్స్ తో పాటు అర్జీ, కరెంట్ ఇబ్బందుల పై అర్జీ, సైదాదుపల్లిలో సర్వే నెంబర్ 1366-2ఏ మెట్టు భూమి రెడ్ మార్క్ పడిందని తొలగించాలని అర్జీ, 351 సర్వేనెంబర్ పట్టాపై అర్జీ, 351 లో శ్మశానానికి దారిపై అర్జీ వచ్చాయని తహశీల్దారు తెలిపారు. ముఖ్యంగా అర్జీ దారులు అర్జీలతో పాటు ఆధార్, ఫోన్ నెంబర్ తో తమ సమస్యల స్పందన కార్యక్ర మంలో అందచేయాలని తెలిపారు.

విద్యార్థులకు కథలు, కథనాలు, వ్యాయామంపై అవగాహన

విశాలాంధ్ర-రాపూరు: గ్రంథాలయాలలో సాగు తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం లో 30వ రోజు రాపూరు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గ్రంథాలయ ఇంచార్జీ ధనమ్మ కథలు, కథనాలు, కవుల జీవిత చరిత్రలు, వ్యాయామం, పలుఅంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వేంకటేశ్వర్లు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర- మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు అరుంధతి వాడకు చెందిన కంటేపల్లి వెంకటేశ్వర్లు వడదెబ్బతో మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండ తాకిడికి తట్టుకోలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నిరుపేద కుటుంబం లో కుటుంబ పోషణ పెద్ద వడదెబ్బకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు వీధిన పడే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వృద్ధులు భానుడి భగభగకు తట్టుకోలేక పోతున్నారు.

ఉపాధి హామీ కూలీలకు వరం: ఏపీడీ

విశాలాంధ్ర- వలేటివారి పాలెం: ఉపాధి హామీ పథ కం కూలీలకు ఒక వరం లాంటిదని కందు కూరు ఏపీడీ సంజీవరావు తెలి పారు. మండ లం లోని నేకు నాం పురం గ్రామంలో జరి గే ఉపాధి హామీ పను లను మంగళవారం ఆ య న పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును గురించి కూలీలను అడిగి తెలుసుకొని కూలీలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని కూలీలు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎండ తక్కువగా ఉన్న సమయంలోనే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని పేర్కొన్నారు. ఉదయం 5.30గంటల నుండి 9.30 గంటల వరకు కనీసం 4 గంటలకు తగ్గకుండా పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన 272 రూపాయలు కూలి పొందాలన్నారు. ఉపాధి హామీ పనులు నాణ్యతగా ఉండాలని అన్నారు పనులవిషయంలో రాజీ పడవద్దని చూచించారు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కొల్లూరి ప్రసన్న శ్రీనివాసులుని ఆదేశించారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కొల్లూరి ప్రసన్న శ్రీనివాసులు, మేట్లు పాల్గొన్నారు.

ఆనం విమర్శలు అర్థరహితం

- బాబు మెప్పు కోసమే విమర్శలు - వైసీపీ నాయకులు ఎద్దేవా

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: రాష్ట్రంలోని పలు రాజకీయ పార్టీలలో పనిచేసిన అనుభవం కలిగిన సీనియర్ నేత మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన స్థాయిని మరిచి వైసీపీపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని బాబు మెప్పు కోసమే ఇలా చేస్తున్నాడని పిస్తుందని ఇలాంటి విమర్శలు ఇకపై మానుకోవాలని వైసీపీ ఏఎస్ పేట మండల నాయకులు హితవు పలికారు. ఆనం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వైసీపీ సీనియర్ నేత మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కుమారుడు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రం రెడ్డి సూచనలతో ఏఎస్పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బి పద్మజా రెడ్డి, జె సి ఎస్ కన్వీనర్ పులిమి వెంకట రమేష్ రెడ్డి ల ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మజా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తుంటే కొందరు ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. రాజధాని నిర్మిస్తానని చెప్పి అమరావతి ప్రాంతంలోని రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకొని భ్రమరావతిని చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దేనని అన్నారు. రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధి స్తుందని కేంద్ర ప్రభుత్వం సైతం ఏపీ ముఖ్యమంత్రి నీ ప్రశంసిస్తున్నారని తెలిపారు. గతంలో ఆత్మకూరులో ఎమ్మెల్యేగా పనిచేసే మంత్రిగా ఉన్న ఆనం కలిగిరి హసనాపురం మధ్య ఉన్న ఆర్అండ్‌బి రోడ్డును పూర్తి స్థాయిలో వేయకుండా ఇబ్బందులకు గురి చేశారు అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మేకపాటి విక్రం రెడ్డి ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. టిడిపి హయాంలో ప్రతిపక్షంలో ఉన్నవారు ఒక్క పెన్షన్ సైతం తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందని ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వం సంక్షేమాన్ని అంద జేస్తుందన్నారు. 2024 లో మేకపాటి విక్రమ్ రెడ్డి అధిక మెజారిటీతో ఆత్మకూరు నుంచి గెలు పొందుతారని ఎవరు ఆయన గెలుపును అడ్డుకోలేరని తెలిపారు. పదవుల కోసం పార్టీలు మారే వారి విమర్శలను పట్టించుకోబోమన్నారు. జే సి ఎస్ కన్వీనర్ పులిమి వెంకట రమేష్ రెడ్డి మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి ఆత్మకూర్ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. మేకపాటి, వైఎస్ కుటుంబాలను పార్టీలు మార్చే ఊసరవెల్లి నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. మీ గత చరిత్ర ఏమిటో ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లా డాలన్నారు. మాజీ ఎమ్మెల్యేగా ఉండి కావలి ఎడవల్లి గ్రామంలో ఏ అర్హతతో బోర్డుపై పెద్ద పెద్ద అక్షరాలతో పేర్లు రాసుకున్నారని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా గెలుపొందిన ఎమ్మెల్యే పై రాజ్యాంగేతర శక్తిగా మీరు వ్యవహరించలేదా అన్నారు. ఎవరి మెప్పు పొందేందుకు ఇలా మాట్లాడుతున్నారు. ఆత్మకూరు ప్రజలు అర్థం చేసుకోలేనంత వారు కాదని తెలిపారు. వక్ బో ర్డ్ జిల్లా వైస్ చైర్మన్ షౌకత్ అలీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పై ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిపై ఆనం లాంటి పెద్ద నాయకులు విమర్శలు చేయడం శోచనీ యమన్నారు. 2024 లో వైసీపీలో సీట్లు రావని కొందరు ఇలా విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఆత్మకూరులో తెలుగుదేశం పార్టీలో ఏ నాయకుడు పోటీ చేసిన విక్రం రెడ్డి గెలుపును అడ్డుకోలేరన్నారు. కో ఆప్షన్ సంధాని భాష నాయకులు ఐతా వెంకటేశ్వర్లు నాయుడు, జనార్దన్ రెడ్డి ,కోటిరెడ్డి తదితరులు మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి పై విమర్శలు చేయడం అర్ధరహితమన్నారు. ప్రజల మనోభావాల మేరకే స్టిక్కర్లు అంటిస్తున్నామని ఎక్కడా బలవంతంగా అంటిస్ చడం లేద న్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లాగా పాలన అందిం చలేదన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రతిపక్ష పార్టీలు గతంలో ప్రజలకు పరగబెట్టిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురా శ్రీనివాసులు రెడ్డి, ఎం రమణయ్య ,జిల్లాని బాష పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం శ్రీ వెంగమాంబ పేరంటాలు

- కన్నుల పండుగగా జరగనున్న బ్రహ్మోత్సవాలు
- రాష్ట్రవ్యాప్తంగా హాజరుకానున్న భక్తులు

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: భక్తుల కొంగుబంగారంగా మెట్ట ప్రాంత ప్రజల ఆరాధ్య దైవంగా.. పతి భక్తికి ప్రతి రూపంగా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అంటరానితనం నిర్మూలనకర్తగా... వలసవాసుల వరాల తల్లిగా విరాజిల్లుతున్న నర్రవాడ శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 15 వరకు జరగనున్నాయి. ఏటా జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి దాటిన మొదటి ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు హాజరవుతారు. లక్షలాది మంది భక్తులు హాజర య్యే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వెంగమాంబ చరిత్ర: దుత్తలూరు మండలం నర్రవాడ పంచాయతీ మజరా గ్రామమైన వడ్డిపాళెం వాస్తవ్యులైన పచ్చవ వెంగమనాయుడు. సాయమ్మ దంపతులకు కుల దైవమైన రేణుకాదేవి అనుగ్రహం తో వెంగమాంబ జన్మించింది. వెంగమాంబకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఉండేది. వెంగమాంబకు నర్రవాడ కుచెందిన వేమూరి గురవయ్యతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. వివాహానంతరం భర్తకు అనుకూలంగా ఉంటూ ఆర్యదంపతులుగా ఉండేవారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడేవారు. అభాగ్యులను ఆదుకుంటూ ఆదర్శ గృహిణిగా నిలిచారు. అగ్రవర్ణాల దళితులను మంచినీటి బావుల వద్దకు రాకూడదనే సమయంలో ఈమె నీటిని చేసి దళితులకు అందించేవారు. వారి కోసం బావిని కూడా తవ్వారు. ఇప్పటికీ ఆ బావిని వేమూరి వారి బావిగా పిలుస్తున్నారు. ఒక రోజు ఆమె భర్త గురవయ్య నాయుడు పశువులను మేపేందుకు గ్రామ సమీపంలోని అడవికి వెళ్లారు దీన్నే దొడ్డకొండ అంటారు. అదే సమయాన వెంగమాంబ స్నేహితులతో కలిసి గడ్డకోసం అడవికి వెళ్లారు ఇంతలో అకస్మాత్తుగా దొంగలు వచ్చి పశువులను అటకాయించారు. దీంతో బిగ్గరగా కేకలు వేశారు. అడవిలో ఉన్న గురవయ్య ఒక్క ఉదుటున అక్కడికి చేరుకుని దొంగలతో తలపడ్డారు దొంగలందరినీ హతమార్చగా ఒక దొంగ చాటుగా ఈటెతో గురవయ్య గుండెకు విసిరాడు. దీంతో గురవయ్యకు తీవ్రంగా రక్తస్రావమై స్పృహ కోల్పోయారు. మూడు రోజుల పాటు భార్య వెంగమాంబ, గ్రామస్తులు ఎన్ని సపర్యలు చేసినా స్పృహలోకి రాలేదు. దీంతో వెంగమాంబ తన భర్త మరణించకముందే ముత్తయిదువుగా అగ్నిగుండ ప్రవేశం చేయాలని నిర్ణయించుకొని తల్లిదండ్రులు గ్రామస్తులను ఒప్పించారు. నరవాడ గ్రామంలోని మధ్య భాగాన అందరూ చూస్తుండగానే అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆమె అగ్నిగుండ ప్రవేశం చేసిన తెల్లవారి అక్కడ వెంగమాంబ మంగళ సూత్రాలు పైటకొంగు కాలకుండా గ్రామస్తులకు కనిపించాయి. అనంతరం వెంగమాంబ స్నేహితురాలు అయిన తుమ్మల పెద వెంగమ్మ బావగారైన ముసలయ్య నాయుడుకి కలలో కనిపించి తనకో దేవాలయాన్ని నిర్మించాలని కోరారు. అనంతరం వెంగమాంబ దేవాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

అమ్మ పెట్టుబడితో వ్యాపారంలో అధిక లాభాలు

వెంగమాంబ పేరంటాలు దేవస్థానం తరఫున అమ్మవారి నగదును భక్తులకు అంద జేస్తారు. భక్తులు రూ. 100 చెల్లిస్తే అమ్మవారి నగమను చిల్లర రూపంలోరూ.80 అందజే స్తారు. ఈ నగదును వ్యాపార పెట్టుబడిలో కలపగా అధిక ఆదాయాలు వస్తాయనేది భక్తుల నమ్మకం. ఈ విధంగా అధిక ఆదాయాలు పొందిన భక్తులు అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి తమ వంతు కానుకలను అందిస్తున్నారు. అమ్మవారి పేరుతో పలు జిల్లాలు, రాష్ట్ర ల్లో వ్యాపార సంస్థలు, హోటళ్లు నడుస్తున్నాయి.

దేవస్థానానికి చేరుకునేదిలా: దుత్తలూరు మండలం నర్రవాడలో దేవస్థానం ఉంది. ఇక్కడికి చేరుకోవాలంటే నెల్లూరు నుంచి దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గంలో నర్రవాడలో దిగాలి. ఒంగోలు నుంచి కందుకూరు మీదుగా దుత్తలూరు వెళ్లే మార్గాన, కడప నుంచి బద్వేలు, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గాన, పోరుమామిళ్ల నుంచి సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు మార్గాన నర్రవాడకు చేరుకోవాలి.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు: ఐదు రోజుల పాటు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11న నిలుపు కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. అదే రోజున సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడతారు. 12వ తేదీన వెంగమాంబ గురవయ్య నాయుడుల రథోత్సవం, 13 వ తేదీన రథోత్సవం, 14వ తేదీన ఉదయం వెంగమాంబ గురవయ్య నాయుడుల కళ్యాణం పసుపు కుంకుమ ఉత్సవం రాత్రికి ప్రధానోత్సవం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాలలో చివరి రోజు అయిన 15వ తేదీ పొంగళ్లు, ఎడ్లు బండలాగు ప్రదర్శన తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈసారి బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజులు అన్నదాన కార్యక్రమం వివిధ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అలయ ధర్మకర్తలు అధికారులు తెలిపారు.